ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

కుత్బుల్లాపూర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.6వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. బీటెక్, ఇతర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు బకాయిలు చెల్లించకపోవడంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి బట్టి విక్రమార్కను ఆ విషయమై సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, బీసీ ఐక్యవేదిక గ్రేటర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొత్త అశోక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాది అభిషేకం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిఖిల్, జంగిల్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

‘సుపరిపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారు’



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మల్యాల రమణి

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ స్పోక్స్‌పర్సన్ మల్యాల రమణి గురువారం హన్మంతరెడ్డి సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంల అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, వంట గ్యాస్, ఉచిత విద్యుత్ పథకాలతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలోపేతం అవుతోందన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సైతం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కృష్ణ, తిరుపతిరెడ్డి, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కమ్మ’లకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కమ్మ సేవా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: కమ్మ సేవా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం సభ్యులు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. కమ్మ సమాఖ్యకు గతంలో కేటాయించి స్థల వివాదం హైకోర్టులో ఉందని దీని పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి కోరాలని విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట వద్ద భక్తుల సహాయార్థం కమ్మ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. కమ్మ కులస్తులకు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కమ్మ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి పేద కమ్మ కులస్తుల అభ్యున్నతి కృషి చేయాలన్నారు. కమ్మ సంఘం నాయకులు సోమూరి వెంకటకృష్ణ, కలగర శ్రీనివాసరావు, బిక్కసాని నాగేశ్వరరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, బొడ్డు అశోక్, పెదనాటి వెంకటేశ్వరరావు, సూరపనేని సురేష్, ఉమామహేశ్వరరావు, యలమర్తి కిషోర్, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, సంపత్‌కుమార్, యలమంచిలి కృష్ణారావు, రాంబాబు తదితరులు ఉన్నారు.

వైభవంగా జైదుర్గ నవదుర్గ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు వివేకానంద్, అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు

కుత్బుల్లాపూర్: జగద్గిరిగుట్ట డివిజన్ సీసాలబస్తీలోని జైదుర్గ నవదుర్గ ఆలయ మొదటి వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు వివేకానంద్, అరికెపూడి గాంధీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, వేంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణుయాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు కొలుకుల జైహింద్, పాపయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో కమ్యూనిటీ భావాన్ని పెంపొందిస్తాం



విద్యార్థికి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్

దుండిగల్: విద్యాపరంగా.. వ్యక్తిగతంగా విద్యార్థులు ఎదగడానికి ఓక్రిడ్జ్ సహాయపడుతుందని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి శాఖ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురువారం పాఠశాల ఆవరణలో 'ఇయర్ ఆఫ్ రెసిలెన్స్'థీమ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన విద్యార్థులకు బల్జీత్ ఒబెరాయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కమ్యూనిటీ భావాన్ని పెంపొందిస్తామని అన్నారు. ఇది విద్యార్థులను దృఢమైన వ్యక్తులుగా మారుస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలకు చెందిన కుటుంబాలు విద్య కోసం ఓక్రిడ్జ్‌ను ఎంచుకుంటున్నాయని తెలిపారు. మలేషియా నుంచి ఇండియాకు షిఫ్ట్ అయిన పేరెంట్ హఫీజ్ తన ఇద్దరు కుమార్తెలు హన్నా, హైరా ఓక్రిడ్జ్‌లో చేర్పించగా పాఠశాల యాజమాన్యం స్వాగతం పలికింది.



ఆర్చరీ శిక్షణలో విల్లు ఎక్కు పెట్టిన విద్యార్థులు



సాధన చేస్తున్న విద్యార్థి

ఆటలతోనే ఆరోగ్యం

చదువుతో పాటు ఆటలు అవసరమంటున్న కోచ్‌లు

• ఏదో ఒక క్రీడలో తర్ఫీదు ఇప్పించాలంటున్న వైద్యులు • అప్పుడే చిన్నారులు శారీరకంగా.. మానసికంగా దృఢంగా ఉంటారని వ్యాఖ్య



స్కేటింగ్‌లో సాధించిన పతకాలతో విద్యార్థులు

జీడిమెట్ల: చిన్నారుల్లో చదువుతో పాటు శారీరక దృఢత్వం కలిగి ఉండాలని.. చిన్న వయస్సులోనే స్థూలకాయం బారిన పడకూడదని.. వారి మెదడు చురుగ్గా పనిచేయాలని.. క్రమశిక్షణ, ఏకాగ్రత పెరగాలని.. ముఖ్యంగా వారిని వారు కాపాడుకునేందుకు ఆత్మరక్షణకు సన్నద్ధంగా ఉండాలని ఎస్ఆర్ నాయక్‌నగర్‌కు చెందిన కుంగ్‌ఫూ మాస్టారు మదిచర్ల పండు మహేందర్ అంటున్నారు. ఆయన పొద్దున లేవగానే ఉదయం 5గంటలకే చిన్నారులతో సాధన చేయిస్తుంటారు. అలా ఉదయం మొదలైన మన మాస్టారు సాధన సాయంత్రం 6గంటల వరకు సాగుతూనే ఉంటుంది. ఆయన ప్రతినిత్యం వందల మంది విద్యార్థులకు వివిధ స్కూళ్లలో కుంగ్‌ఫూ, కర్రసాము, ఆర్చరీ, స్కేటింగ్‌లలో శిక్షణ ఇస్తూ ఉంటారు.

ఫిజికల్ ఫిట్‌నెస్‌తో ఉంటేనే..

ప్రతి విద్యార్థి తన శరీరంలో జీవక్రియలు సక్రమంగా జరగాలి అంటే శరీరాన్ని కష్టపెట్టాల్సిందే. నేటి యాంత్రిక జీవనంలో చిన్నారులు కేవలం పుస్తకాలతో కుస్తీ పడటమే కాకుండా క్రీడల వైపు కచ్చితంగా మొగ్గు చూపాల్సిందే. నేటి చిన్నారుల్లో చిన్న వయస్సులోనే స్థూలకాయం, థైరాయిడ్, చెక్కర వ్యాధులను చూస్తున్నాం కాబట్టి పాఠశాలలో చిన్నారులకు ఖచ్చితంగా ఆటలు, వ్యాయామం లాంటివి ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలి అని డాక్టర్లు సైతం సలహాలు ఇస్తున్నారు.

ఖచ్చితంగా ఆటలు ఆడించాలి



చిన్నారులు శారీరకంగా దృఢంగా ఉండేలా చిన్నారుల తల్లిదండ్రులు చూసుకోవాలి. చిన్నారులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో ఉండాలంటే వారిని ఖచ్చితంగా వ్యాయామంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపేలా తయారు చేయాలి. పాఠశాలలో ప్రతిరోజు చిన్నారులతో ఆటలు ఖచ్చితంగా ఆడించాలి.

– మహేందర్, కోచ్

బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలోని కురుమ సామాజికవర్గ ప్రతినిధి బీర్ల అయిలయ్యకు రాష్ట్ర మంత్రివర్గంలోకి తక్షణమే తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ కురుమ రాజకీయ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జేఏసీ నేత జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణతో కలిసి వంశీకృష్ణ మాట్లాడారు. కుల ప్రాతినిధ్యం లేకుండా దేశంలో దాదాపు ఏ మంత్రివర్గం లేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ సాధనకు పోరాటం చేసిన బెల్లి లలితది కూడా కురుమ సామాజిక వర్గమే అని అన్నారు. అదే ప్రాంతానికి, కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీర్ల ఐలయ్యకు తక్షణమే మంత్రి పదవి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

జాతీయ క్రీడా కోడ్ అమల్లోకి తీసుకురావాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడా కోడ్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావాలని తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ టోర్నమెంట్ జరిగిన సంబంధిత క్రీడల్లో గుర్తింపు కలిగిన రాష్ట్ర, జిల్లా క్రీడా సంఘాల అనుమతితోనే జరిగాయని గుర్తు చేశారు. ఇష్టారాజ్యంగా టోర్నమెంట్‌లు పెడుతూ క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అవిశ్రాంత రైతు ఉద్యమ నేత ‘అతుల్‌కుమార్ అంజాన్’

హిమాయత్‌నగర్: రైతుల పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు రుణ విమోచన చట్టాలను సాధించుకున్నప్పుడే అవిశ్రాంత రైతు ఉద్యమ నాయకులు, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత అతుల్ కుమార్ అంజాన్‌కు మనమిచ్చే ఘన నివాళి అవుతుందని రైతులు సంఘాల నాయకులు, వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో బుధవారం సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత అతుల్ కుమార్ అంజాన్ సంస్మరణ సభ నిర్వహించారు.

కార్మిక హక్కుల సాధనకు కృషి చేయాలి



అల్కాలిక్ మెటల్స్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులను సత్కరిస్తున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల న్యాయబద్ధమైన హక్కుల సాధనకు కార్మిక సంఘాలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. దుండిగల్ మండలం డీపోచంపల్లిలోని అల్కాలిక్ మెటల్స్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా కౌన్సిలర్ రాముగౌడ్ ఎన్నికయ్యారు. అదే విధంగా అడ్వైజర్లుగా శ్రీశైలంగౌడ్, బొంగునూరి ప్రభాకర్‌రెడ్డిని నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం నూతన కమిటీ సభ్యులు షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలవగా వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగుల సంక్షేమానికే యూనియన్‌లు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కౌన్సిలర్ ఎం.రాముగౌడ్, ప్రధాన కార్యదర్శి శంకర్, కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తప్పిపోయి.. తల్లి కోసం తపించిపోయి



అంగడిపేటలోని 44వ జాతీయ రహదారిపై తన తల్లి కోసం వెతుకుతూ పరిగెడుతున్న దూడ

సుభాష్‌నగర్: తల్లి నుంచి తప్పిపోయిన దూడను ఓ జంతు ప్రేమికుడు చేరదీసి గోశాలకు అప్పగించాడు. అంగడిపేటలోని 44వ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం 1:30గంటల సమయంలో రద్దీగా ఉన్న వాహనాల మధ్య దూడ అటు ఇటు తిరుగుతూ కనిపించింది. ఓవైపు వాహనాలు మరోవైపు కుక్కలు వెంబడించాయి. ఏఎస్‌రావునగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి జంతు ప్రేమికుడు మనోహర్ అటువైపుగా వెళ్తుండగా ఆ దూడను చేరదీశాడు. చుట్టుపక్కల ఆరా తీసినా ఎలాంటి సమాచారం లభించకపోవడంతో ఆ దూడను జీడిమెట్ల గోశాలకు అప్పగించాడు. ఎవరైనా ఈ దూడ సంబంధీకులు ఉంటే జీడిమెట్ల గోశాలలో సంప్రదించాలని కోరారు.

కొత్తకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలి



కొత్తకుంట చెరువును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మేడ్చల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి అన్నారు. గురువారం సూరారం శ్రీకృష్ణనగర్ సర్వే నం.23లోని కొత్తకుంట చెరువును బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొత్తకుంట చెరువును కొందరు ప్లాట్లుగా చేసి విక్రయాలు చేపడుతున్న విషయయాన్ని జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన కరువైందన్నారు. అధికారులు ఇదే విధంగా వ్యవహరిస్తే చెరువులు కనుమరుగు అవుతాయని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బావిగడ్డ రవి, కేశవ్ యాదవ్, సురేష్ గౌడ్, పత్తి రఘుపతి, దుర్యోధనరావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటా



మహిళా కార్మికులకు చెక్కులు అందజేస్తున్న కార్మిక నేత మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని ఐఎన్‌టీయూసీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ బాలాజీ స్పోర్ట్స్ వేర్ మినీ ఇండస్ట్రీలో పని చేస్తున్న 21 మంది మహిళా కార్మికులు గత సంవత్సర కాలంగా సక్రమంగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ వస్తోంది. ఈ విషయమై సదరు కార్మికులు మదన్‌గౌడ్‌ను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి సదరు కార్మికులకు బకాయి పడ్డ జీతాలను గురువారం చెక్కుల రూపంలో అందజేసి న్యాయం జరిగేలా చూశారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను దోచుకుంటే ఊరుకునేది లేదన్నారు. అదే విధంగా కార్మికులను డ్యూటీకి తీసుకువెళ్లిన ఇద్దరు ఆటో డ్రైవర్లకు సైతం యాజమాన్యంతో మాట్లాడి చెక్కులు అందజేశారు.

16న ఇనార్బిట్ మాల్‌లో ఫాదర్స్ డే

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ఈ ఏడాది కూడా ఫాదర్స్ డే వేడుకల్ని నిర్వహించనున్నట్లు మాల్ ప్రతినిధులు తెలిపారు. జూన్ 16వ తేదీన జరిగే ఫాదర్స్‌డే కోసం మాల్‌లో ప్రత్యేకమైన థీమ్ అలంకరణలు, ఫొటోబూత్‌లు సిద్ధం చేశామని, తండ్రుల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. తండ్రులకు అద్భుతమైన బహుమతులతో పాటు మరచిపోలేని అందమైన జ్ఞాపకాలను అందించేలా అన్నీ సిద్ధం చేశామన్నారు. షాప్ అండ్ విన్ థ్రిల్ పేరిట ప్రత్యేక బ్రాండ్స్ దుస్తుల ప్రదర్శన కూడా ఉందన్నారు.

15,16 తేదీలలో నేచర్ క్యాంప్

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల నేచర్ క్యాంప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ చేరువలోని చిలుకూరు ఫారెస్ట్‌ట్రెక్ పార్కులో ఈ క్యాంపు ఉంటుందని టీఎస్ఎఫ్‌డీసీ అధికారులు తెలిపారు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు పాల్గొనే వారు రిపోర్టు చేయాలని, ఈ కార్యక్రమాన్ని 16వ తేదీ ఉదయం 10 గంటలవరకు నిర్వహిస్తారు. కార్యక్రమంలో పాల్గొనేవారిలో 12 ఏళ్ళు పైబడిన వారు రూ.1800 చెల్లించాలని, 5 నుంచి 12 ఏళ్ళలోపు ఉన్నవారు రూ.1200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్9493549399, 9346364583లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



నార్త్ సిటీ హైస్కూల్లో నర్సరీ విద్యార్థులకు అక్షరాభ్యాసం

సుభాష్‌నగర్: నేటి కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరు చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. ఇటీవల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో నర్సరీ చదువుతున్న చిన్నారులకు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో స్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్, టీచర్లు అక్షరాభ్యాసం చేయించారు.

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్

హిమాయత్‌నగర్: జీవో నెం.1ను ఉల్లంఘిస్తూ పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీలను పాఠశాలలో విక్రయిస్తున్న హిమాయత్ నగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తున్న పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ పోరాటంతో గౌతమ్ మోడల్ స్కూల్ పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తున్న గదిని హైదరాబాద్ జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. ఈ నెల 4వ తేదీన సదరు పాఠశాలకు అధికారులు వచ్చి సర్వే నిర్వహిస్తే, తమ పాఠశాలలో ఎటువంటి అమ్మకాలు జరపడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ... హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా తక్షణమే అన్ని పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, నిబంధనలను ఉల్లంగిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రిలో ‘ఈ వార్డ్స్’ ప్రారంభం



ఆస్పత్రిలో ఈ వార్డ్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నిత్య తదితరులు

సుభాష్‌నగర్: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో గురువారం 'ఈ వార్డ్స్ – డిజిటల్ హెల్త్ సొల్యూషన్ ప్రోగ్రామ్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నిత్య మాట్లాడుతూ.. అన్ని వార్డు బెడ్‌లు ఇప్పుడు అత్యాధునిక ఏఐ – శక్తివంతమైన రిమోట్ పేషెంట్ మానిటరింగ్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్ ద్వారా కాంటాక్ట్‌లెస్, నిరంతర పర్యవేక్షణను కలిగి ఉంటాయన్నారు. ఈ అనుసంధానంతో రోగికి భద్రత, సౌకర్యవంతమైన సంరక్షణను అందించడం సాధ్యపడుతుందన్నారు. ఈ టెక్నాలజీ వైద్యపరమైన క్షీణత సంకేతాలను వేగంగా గుర్తించడానికి అనుమతి ఇస్తుందన్నారు.

క్షత్రియ సమాజ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ అందజేస్తున్న క్షత్రియ సమాజ్ నాయకులు

చింతల్: కుల సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. షాపూర్‌నగర్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో గురువారం చింతల్‌లోని జయ్స్ కన్వెన్షన్ హాల్‌లో 150 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లారెడ్డి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ఆదుకునేందుకు సేవా సంఘాలు ముందుకు రావాలన్నారు. మంచి మనసుతో ముందుకొచ్చిన క్షత్రియ సమాజ్ నిర్వాహకుల సేవల అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్, ప్రశాంత్, క్షత్రియ సమాజ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సర్కారు బడులు.. ఊడుతున్న పెచ్చులు



గాంధీనగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల భవనం పెచ్చులూడుతున్న దృశ్యం



పాఠశాల కిటికీలు విరిగిన దృశ్యం

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్వహణ విషయంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరినా వాటికి మరమ్మతులు చేయించడంలో జాప్యం చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ జిల్లా పరిషత్ పాఠశాల భవనం పెచ్చులూడుతోంది. అదే విధంగా పాఠశాల తరగతి గదులకు ఉన్న కిటికీల తలుపులు ఊడి పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకుని పాఠశాల భవనాలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.